RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 206 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 5-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

అమ్మ,అక్క,చెల్లి,అత్తయ్య,నానమ్మ
మరదలు,వదినలుగ,మామ్మగాను
కూతురిగను వారు కూర్మితో వసుధన
వెలుగుచంద్రి నేడు వేడుకగను

మీ
నలుమాసు విజయప్రసాద్
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




## నైజీరియాలో క్రైస్త్రవులపై మారణహోమం

- ఇలాగే సాగితే జోక్యం చేసుకోక తప్పదు
- నైజీరియా ప్రభుత్వానికి ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్,
నైజీరియాలో దాడులకు అమెరికా సిద్ధపడుతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. అక్కడి వనరులపై ట్రంప్ కన్నుపడిందన్న ప్రచారం సాగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో నైజీరియా ప్రభుత్వం క్రైస్త్రవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంది. అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులు క్రిస్టియన్లపై దాడులు చేస్తున్నాయి. అమెరికా వెంటనే అన్ని సహాయాలను నిలిపేస్తుంది. ఇప్పుడు అమెరికా సైన్యం ఆ దేశంలోకి వెళ్లి ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నైజీరియా ఉలిక్కిపడింది. ఆఫ్రికా ఖండంలో 230 మిలియన్ల అత్యంత జనాభా కలిగిన దేశం నైజీరియా. ఈ జనాబాలో ముస్లింలు, క్రైస్తువులు దాదాపుగా సమానంగా ఉన్నారు. సాయుధ గ్రూపుల ఘర్షణలో అనేక మంది -మిగతా 2 లో



# జూబ్లీహిల్స్‌లో 30వేల మెజార్టీ తో గెలుపు

**చెల్లిని గెంటేసిన నీచుడు కేటీఆర్**

- వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్..
- పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్
- పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా..
- పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా..
- మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిపించండి
- రహమత్ నగర్ రోడ్‌షోలో సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీ తో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్ లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. -మిగతా 2 లో





## వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్
దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని 54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించు కోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా -మిగతా 2 లో



## బెంగాల్లో సర్‌కు వ్యతిరేకంగా మమత గళం

- కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహణ
- ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం

కోల్‌కతా
బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారంనాడు విరుచుకుపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ బెంగాలీ మాట్లాడే పౌరులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన 'నిశ్శబ్ద రిగ్గింగ్' అని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మంగళవారనాడు కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీని మమత ముందుండి నడిపించారు. ఆమె మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు అభిషేక్ బెనర్జీ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ టైమ్‌లైన్ పెట్టుకుని మరీ ఇంత హడావిడిగా ఎస్ఐఆర్ నిర్వహించడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. బెంగాల్‌లో 2022లో ఓటర్ రివిజన్ జరిగిందని, అందుకు రెండేళ్లు పట్టిందని అన్నారు. -మిగతా 2 లో

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

- మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్
- ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం



హైదరాబాద్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు -మిగతా 2 లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రైలు ప్రమాదం..

- గూడ్స్ రైలును ఢీకొట్టిన కోర్బా ప్యాసింజర్..
- 10 మంది దుర్మరణం



ఛత్తీస్‌గఢ్
ఛత్తీస్‌గఢ్ లోని బిలాస్‌పూర్ లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న కోర్బా ప్యాసింజర్ రైలు.. జయరామ్ నగర్ స్టేషన్ వద్ద ఆగివున్న గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ ఘటనలో 10 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మృతదేహాలను ట్రెయిన్ నుంచి వెలికితీశాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు తరలించాయి. ఘటనా ప్రాంతంలో ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## గ్రామీణ రహదారులకు మహార్దశ

- సాస్కి నిధులతో రోడ్ల పునర్నిర్మాణం
- తోణమే పంచాయితీరాజ్ రోడ్ల పునరుద్దరణ
- రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ ఉండదు
- అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం పవన్

హైదరాబాద్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల పరిస్థితిని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది.. సాస్కి.. పథకం కింద ఆంధప్రదేశ్‌కు రూ. 2వేల కోట్లు మంజూరు చేశారు.. ఈ నిధులను వినియోగించి గ్రామాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మాణం చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ , గ్రామీణాభి వృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ ఉండదు అని స్పష్టం చేశారు.. -మిగతా 2 లో



## బీహార్‌లోను ఉచిత పథకాల వెల్లువ

- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్

పాట్నా
బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వియాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి గోధుమలకు ఎంఎస్‌పి ధర కంటే అదనపంగా క్వింటాలకు రూ. 300, 400 చొప్పన చెల్లించనున్నట్లు హామీనిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పన జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్‌డిఎ కూటమిని దెబ్బతీసేందుకు అలవికాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వియాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి -మిగతా 2 లో

# నిరుద్యోగులను నిండా ముంచారు

**ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదు**

- జాబ్ క్యాలెండర్ హామీలతో మోసం
- ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు
- జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత




ఆదిలాబాద్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం -మిగతా 2 లో


## ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం



- జూబ్లీహిల్స్ ప్రచారంలో రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్ నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. తెలంగాణను దివాళా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ -మిగతా 2 లో

## అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ



- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం -మిగతా 2 లో

## నైజీరియాలో క్రైస్తవులపై మారణహోమం

(మొదటి తరువాయి)

ముస్లిములు అధిక సంఖ్యలో మృతి చెందారు. బొకోహారం వంటి ఉగ్రవాద ముఠాల వల్ల అన్ని మతాలవారు మరణిస్తున్నారు. క్రైస్తవులే లక్ష్యం అనేదానికి స్పష్టమైన ఆధారాలు లేకున్నా, క్రైస్తవులు కూడా మరణిస్తున్నారు. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. తమ దేశంపై మత పరంగా అసహనం వ్యక్తం చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం నైజీరియన్లకు మతపరమైన స్వేచ్ఛ కోసం, వారి విశ్వాసాలను కాపాడటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పౌరులకు భద్రతను ప్రభుత్వం కల్పిస్తుందని, తీవ్రవాద అంతానికి అమెరికాతో సహా అంతర్జాతీయంగా కలిసి పనిచేస్తామని వెల్లడించారు. నైజీరియాలో సామూహికంగా క్రైస్తవులను హత్యలు చేస్తున్నందున మత స్వేచ్ఛను ఉల్లంఘించే దేశంగా గుర్తించాలని అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ గత వారం కాంగ్రెస్‌లో ప్రకటించిన తరువాత ట్రంప్ ఈ బెదిరింపులకు చేయడం గమనార్హం. ట్రంప్ ఉద్దేశం వేరని, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహకాల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, రాగి, లాందనం, నియోడైమియం, ప్రసోడైమియం వంటి కీలక ఖనిజ నిక్షేపాలు నైజీరియాలో ఉన్నాయని వాటి కోసమే ట్రంప్ బెదిరింపులని పలువురు విశ్లేషిస్తున్నారు.

## బెంగాల్లో సర్‌కు వ్యతిరేకంగా మమత గళం

(మొదటి తరువాయి)

ఇప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియ నెలరోజుల్లోనే పూర్తిచేయాలనుకుంటున్నారని అన్నారు. ఈసీ పారదర్శకత్వను ప్రశ్నిస్తూ... బిహార్ ఎస్ఐఆర్‌లో ఎంతమంది రోహింగ్యాలు, బంగ్లాదేశీయులను గుర్తించారో చెప్పాలన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల జాబితా నుంచి అర్హులైన ఒక్క ఓటరును తొలగించినా బీజేపీ ప్రభుత్వ పతనాన్ని తమ పార్టీ చూస్తుందని మమత హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్‌తో కేంద్రం కుమ్మక్కై ఎస్ఐఆర్ ప్రక్రియను ఒక ఉపకరణంగా వాడుకుంటోందని విమర్శించారు. హిందీ, పంజాబీ మాట్లాడే వాళ్లు ఎలా పాకిస్థానీయులు కాదో బంగ్లా మాట్లాడే వాళ్లు బంగ్లాదేశీయులు కాదని మమత అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఈ భయాలతోనే ఇప్పటికే ఏడుగురు ప్రాణాలు తీసుకున్నారని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. లీగల్ ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగిస్తే ఢిల్లీలో మెగా నిరసనకు మద్దతుదారులంతా సిద్ధంతా ఉండాలని కోరారు. కాగా, టీఎంసీ నిరసనలపై బీజేపీ మండిపడింది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ ఇదని ఆక్షేపణ తెలిపింది. అక్రమ వలసదారులను తమ ఓటు బ్యాంకుగా చేసుకున్న మమతా బెనర్జీ ఇప్పుడు వారికి రక్షణ కల్పిస్తున్నారని బీజేపీ ప్రతినిధి అమిత్ మాలవీయ ఆరోపించారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి తరువాయి)

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, అరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

## అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ

(మొదటి తరువాయి)

అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు కేటాయించి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచార అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

## ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

(మొదటి తరువాయి)

ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి బతిమిలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకునే లాగా చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 165 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారన్ని ఫైర్ అయ్యారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. కేసీఆర్ హయాంలో అద్భుతంగా నడిచిన పాఠశాలలు మూతపడేలాగా చేశారని ఆక్షేపించారు. హస్తం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 100 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. ఇవాళ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేశారని విమర్శించారు. ఆయనకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. హైడ్రా పేరుతో పేదల ఇల్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆఖరి స్థానంలో నిలబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో 30వేల మెజార్టీ తో గెలుపు

(మొదటి తరువాయి)



ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. 'పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేట లో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్.. మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించిన ది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

## వ్యవసాయం మనజీవన విధానంలో భాగం

(మొదటి తరువాయి)

రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పు కొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ధి పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## నిరుద్యోగులను నిండా ముంచారు

(మొదటి తరువాయి)

చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

## బీహార్‌లోను ఉచిత పథకాల వెల్లువ

(మొదటి తరువాయి)

కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్లు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధర (ఓ÷ూఖ)తో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.. రైతులకు నీటి పారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తాము. మై బహీన్ మాన్ యోజన పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో జనవరి 14వ తేదీకల్లా రూ. 30,000లు జమ చేస్తాం. ఇది సంవత్సరం మొత్తానికి వర్తిస్తుంది. నూతన సంవత్సరం, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా ముందుగానే నగదును జమ చేస్తాం. నిత్యవసర ధరలు పెరిగిన ఈ సమయంలో.. ఈ డబ్బుతో వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. రాష్ట్రంలోని మా తల్లులు,సోదరీమణుల డిమాండ్ల మేరకే మా ప్రభుత్వం ఏర్పడుతుంది' అని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మహాగట్బంధన్ కట్టుబడి ఉందని తేజస్వి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి ఇంటి నుండి 70 కిలోమీటర్ల లోపే వారి బదిలీలు చేస్తాము. బదిలీల పోస్టింగ్‌లో కచ్చితంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. దీన్నే మ్యానిఫెస్టోలో కూడా ప్రస్తావించాము అని తేజస్వి అన్నారు.

## గ్రామీణ రహదారుకలు మహర్దశ

(మొదటి తరువాయి)

రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు ప్రమాణాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. నిర్మాణం ప్రారంభమైన తర్వాత పలు దశల్లో క్వాలిటీ చెక్ తప్పనిసరి.. ప్రమాణాలకు విరుద్ధంగా పనులు జరిగినా, అవకతవకలు నమోదైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, పుట్టపర్తిలో జరిగే శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో అక్కడి పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంతో ప్రతి గ్రామానికీ పటిష్టమైన, బలమైన రహదారులు అందించడమే లక్ష్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.. సాస్కి'పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్. సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేశామని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2 వేల కోట్లు నిధులు సమకూర్చిందని వ్యాఖ్యానించారు. ఈ నిధులతో ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. ఈ క్రమంలో దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో ఏపీకి సాస్కి నిధులు సమకూరాయని చెప్పుకొచ్చారు.

# నేటి నుంచి మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలు

- ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు
-భారీగా తరలిరానున్న భక్తులు

**కడ్తాల్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ తల్లి జాతర మహోత్సవాలు నేటి నుంచి 10 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో స్నేహలత తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని మైసిగండి మైసమ్మ తల్లి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్ పర్సన్ ఆర్.లక్ష్మీ శిరోళీ పంతు నాయక్, ఈవో స్నేహలత పేర్కొన్నారు. జాతర మహోత్సవానికి విచ్చేసి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎలాంటి ఇబ్బందులు లేకుండా



వేడుకలను ఘనంగా జరుపుటకు ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. నేడు కార్తీక పౌర్ణమి అమ్మవారికి క్షీరాభిషేకం అమ్మ హారతి విశేషాలు అలంకరణలతో ప్రారంభమై, గురువారం సహస్ర చండీయాగం, చిన్నతేరు, శుక్రవారం సహస్ర చండీయాగం, పెద్దతేరు, శనివారం సహస్ర చండీయాగం పూర్ణహుతి, ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించడం, బండ్లు తిప్పుట, సోమవారం అమ్మవారి కూరగాయలలో ప్రత్యేక అలంకరణ వివిధ ప్రత్యేక పూజకార్యక్రమంతో ముగుస్తాయని జాతర మహోత్సవంలో భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## ఉన్నత చదువుతోనే విద్యార్థుల భవిష్యత్





**కడ్తాల్, నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: ఉన్నత చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని బోర్డు అఫ్ ఇంటర్ మీడియట్ శశిధర్ రెడ్డి సూచించారు. మంగళవారం కడ్తాల్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను అయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, వంట గది, పాఠశాల రికార్డులను అయన తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో చర్చించి పాఠ్య ప్రణాళికలను సరైన సమయంలో పూర్తి చేయాలని సూచించారు. పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు విద్యను అందిచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

-నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కడ్తాల్, నవంబర్ 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారం రోజురోజుకు విస్తృతంగా రసవత్తరంగా కొనసాగుతుంది.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ ముఖ్య నేతలు, మంగళవారం జూబ్లీ హిల్స్ లో నవీన్ యాదవ్‌కు మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పూర్తి బాధ్యతగా భావించి జూబ్లీ హిల్స్ లో ప్రచారం మరింత స్పీడప్ చేయాలని నాయకులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించాలనీ చేతి గుర్తుకు అత్యధిక ఓట్లు వేసి నవీన్ యాదవ్ గెలిపించాలని అ దిశగా నాయకులందరూ ఓటర్లను అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లక్పతి నాయక్, రామచంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

## అల్లుకున్న తీగలు ... పొంచి ఉన్న ప్రమాదం



**యాచారం,నవంబర్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పిచ్చి మొక్కలు విద్యుత్ తీగలను చుట్టుకోవడం వల్ల షార్ట్ సర్క్యూట్‌లు మరియు విద్యుత్ షాక్ ప్రమాదాలు సంభవిస్తాయి. అలాగే, ఇవి దోమలు, పాములు వంటి విషపూరిత జీవులకు ఆవాసంగా మారి ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తాయి...ప్రమాదాలకు కారణమవుతాయి.
యాచారం మండల పరిధిలోని తక్కల్లపల్లి నుంచి సాగర్ రహదారి కి వెళ్లే దారిలో ప్రమాదం పొంచి ఉంది రహదారి వెంట విద్యుత్ సరఫరా చేసే స్థంభం పైకి పిచ్చిమొక్కలు ప్రమాదకారంగా ఎదిగాయి ప్రమాదం చోటుచేసుకోక ముందే పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎలిగేడులో వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్ష వత్తుల నోములు

భవాని శంకర ఆలయంలో రుద్రాభిషేకం, దీపదాన పూజలు





**ఎలిగేడు, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రంలోని కాకతీయుల కాలంలో నిర్మితమైన సోమసూత్రం కలిగిన పురాతన భవాని శంకర ఆలయంలో మంగళవారం లక్ష వత్తుల నోములు, రుద్రాభిషేకం, యమ దీప, కార్తిక దీపదాన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.ఆలయం వెలుగుల కాంతులతో ప్రకాశించి, వేదమంత్రోచ్చారణలతో మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ఆధ్యాత్మికతను ఆస్వాదించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సేగ్యామ దయాకర్ శర్మ, ఎలిగేడు మండల ఆర్యవైశ్య సంఘం మాజీ వ్యవస్థాపక అధ్యక్షులు కే. శెట్టి లింగమూర్తి, రమాదేవి, ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కేశెట్టి రాఘవేంద్ర, అపర్ణ దంపతులు, బీజేపీ ప్రధాన కార్యదర్శి కారింగు రాజు గౌడ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షులు బండి రాజు గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ పోలగోని రామచంద్రయ్య, ఆర్గనైజర్ అశ్వల బాలరాజు, కన్వీనర్ మోర శ్రీశైలం, మాజీ బూత్ అధ్యక్షులు సుంకర మహేష్ గౌడ్, భాను, చెరుకు జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అవినీతిపై చర్యలు తీసుకోవాలి



**తిమ్మాపూర్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
2023లో తిమ్మాపూర్ మండలంలోని జి.పి.సె.పా ఎల్.ఎం.డి కాలనీ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయుల సెలవు వేతనాలకు సంబంధించి అక్రమ చలాన్లు, ఆర్థిక అవినీతి జరిగినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. శారదా రెడ్డి సహా పలువురు ఉపాధ్యాయులు రెండు సంవత్సరాలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, ఈ అంశాన్ని డిటిఎఫ్ కరీంనగర్ జిల్లా శాఖ రాష్ట్ర శాఖ దృష్టికి తీసుకెళ్లింది.ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను ఈరోజు కలిసిన డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యం. సోమయ్య, టి. లింగారెడ్డి, అప్పటి డిడిఓ మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, శారదా రెడ్డి మరియు ఇతర ఉపాధ్యాయులకు సెలవు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సకినాల రామ్మోహన్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సిరిసిల్ల జిల్లా డిటిఎఫ్ బాధ్యులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని డిటిఎఫ్ నేతలు డైరెక్టర్‌ను కోరారు.

## రాజగోపుర నిర్మాణానికి నవదంపతుల విరాళం



**షాద్‌నగర్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని శ్రీ శివమారుతి అయ్యప్ప దేవాలయంలో నిర్మించబోతున్న రాజగోపురం నిర్మాణానికి గుడిపాటి సురేష్ డాక్టర్, శ్రీమతి నిర్మల ల కుమారుడు సాయి అనురాగ్, శ్రీమతి అఖిల గారు నవదంపతులుగా రూ.51 వేల రూపాయల విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని దేవాలయ అధ్యక్షులు శ్రీ లష్కర్ ఆంజనేయులుకి స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, అర్చకులు రవిశర్మ, సునీల్ చారి, రాజగోపాల కృష్ణ, నర్సిములు తదితరులు పాల్గొన్నారు. రాజగోపుర నిర్మాణం ఆలయ అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## ఆన్‌లైన్ వ్యాపార మోసాల్లో ఇద్దరు అరెస్ట్

-12.64 లక్షల మోసం, కారుతో పాటు పలు వస్తువులు స్వాధీనం



**జగిత్యాల, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆన్‌లైన్ వ్యాపార మోసాల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. ఫిర్యాదుదారుడు ఎక్కల దేవి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నిందితులుగా నిర్మల్‌కు చెందిన పస్పూల శ్రీధర్ (ఏ-1), కొత్వాక్ క్రిష్ణ (ఏ-2)లను గుర్తించారు.సిమెంట్, ఐరన్ సరఫరా పేరుతో పెద్ద షాపుల నుంచి ఆర్డర్లు తీసుకుని చిన్న షాపులకు పంపిస్తూ వారి వద్ద నుంచి ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసి దాదాపు 12.64 లక్షలు మోసం చేసినట్లు వెల్లడించారు. జగిత్యాల కొత్త బస్టాండ్ వద్ద కారులో (టీఎస్-18-టీ-7507) వస్తుండగా వారిని పట్టుకుని, రెండు మొబైల్ ఫోన్లు, డెబిట్-క్రెడిట్ కార్డులు, బిల్ బుక్స్, కోటేషన్ బుక్, మారుతి డిజైర్ కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే 15కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్ఐ కృష్ణ, సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు.

# మొగిలిగిద్ద పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ




**ఫరూక్‌నగర్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ముందుగా గోదా రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 వేల నోటుబుక్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా, ఈరోజు మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ జరగడం సంతోషకరమని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందే సురేష్ గుప్తా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు పొందిన పాఠశాలగా మొగిలిగిద్ద పాఠశాల



నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. పాఠశాల హెడ్మాస్టర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు నోటుబుక్స్ అందించడం ఎంతో ఆనందదాయకమని, ఇది విద్యాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుస్తక కమిటీ చైర్మన్ ఎల్కుర్తి నారాయణ గుప్తా, ఫరూక్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు హన్మారి మురళి గుప్తా, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్యాంసుందర్ మల్లేష్, షాద్‌నగర్ ప్రముఖ వ్యాపారవేత్త పలబట్ల పాండురంగం గుప్తా, సామాజిక కార్యకర్త నీల రవీందర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మాధవి నందకిషోర్, గడ్డం ఆంజనేయులు, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్, బండారి శంకర్, ఫరూక్‌నగర్ మండల మాజీ అధ్యక్షులు ఎల్కుర్తి జగదీశ్వర్, ఉప్పల సత్యం, ఉపాధ్యాయులు వెంకట హరికృష్ణ, గీతా రాణి, పీ నర్సింలు, ఏ వెంకటరెడ్డి, బీఎంపీ రాజు, గ్రామస్తులు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# హజరత్ జిందాషా మదార్ ఉర్సు షరీఫ్ పోస్టర్ ఆవిష్కరణ

### హెచ్.ఎం.టీ దర్గాలో నవంబర్ 9 నుంచి ఉత్సవాలు



**చింతల్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చింతల్ డివిజన్ హెచ్.ఎం.టీ ప్రాంతంలోని హజరత్ జిందాషా మదార్ దర్గాలో ఈనెల 9వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉర్సు షరీఫ్ ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఈరోజు పేట్ బషీరాబాద్‌లో ఆవిష్కరించారు. బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ చేతులమీదుగా కమిటీ సభ్యులు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలు, భక్తుల రాకపోకల వివరాలతో కూడిన ఈ గోడప్రతి ఆవిష్కరణ సందర్భంగా భక్తులలో ఉత్సాహం నెలకొంది. ఉర్సు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు ఎం. అబ్దుల్ ఖాదీర్, సభ్యులు ఎం. రియాజ్, బాబుమియా, ఎం. రషీద్, గౌస్ భాయ్, కాశిఫ్, చాంద్, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం గట్టాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు

**జూబ్లీ హిల్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం గట్టాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మహిళా కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావుతో కలిసి షేక్‌పేటలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ, "జూబ్లీ హిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే, ప్రజల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే మార్గం. సమగ్ర



అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. అభ్యర్థి నవీన్ యాదవ్ సేవాతత్పరుడిగా పేరుగాంచారని, ఆయన స్థాపించిన 'నవ నిర్మాణ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ఆయన నైజమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాహితానికి పాటుపడుతున్న నవీన్ యాదవ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. ఈ ప్రచారంలో బెజ్జంకి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు డాక్టర్ పి. రాజశేఖర్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్, రాసూరి మల్లికార్జున్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, రావుల నర్సయ్య, వి. సంపత్ రెడ్డి, పులి రమేశ్, మధుసూదన్, సాదిక్, వేణు, సంతు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

### సన్మాన్ ట్రినిటీ విల్లాస్ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
132 – జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సన్మాన్ ట్రినిటీ విల్లాస్ సంక్షేమ సంఘం సభ్యులు ఈరోజు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజ్, రోడ్డు సమస్యలపై విన్నవించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వెలుస్తున్న కొత్త కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, సన్మాన్ ట్రినిటీ విల్లాస్‌లో అవసరమైన మౌలిక వసతులు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ నవీన్ ఎనుముల, ప్రధాన కార్యదర్శి పట్నాయక్, కోశాధికారి ఎం. నితిన్, ఉపాధ్యక్షులు వీరేంద్ర, సభ్యులు సంతోష్, అరుణ్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్, రామిరెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత కళ్ల అద్దాల పంపిణీ

### జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**మంచాల్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మంచాల్ మండలం లోయపల్లి గ్రామంలో జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కళ్ల అద్దాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. "మానవ సేవే మాధవ సేవ" అనే మహత్తర భావంతో ముందుకు సాగుతున్న ఫౌండేషన్, కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు కొత్త వెలుగు ప్రసాదించింది. దూరదృష్టి, సమీపదృష్టి వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు నిపుణులైన కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించి, వారి అవసరానికి తగిన అద్దాలను ఉచితంగా అందజేశారు.




ఈ సేవా కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫౌండేషన్ చూపిన నిస్వార్థత సమాజంలో చైతన్యాన్ని నింపుతోంది. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే స్ఫూర్తిని విద్యార్థుల్లో నాటిన ఈ కార్యక్రమం, కళ్ల సంరక్షణలో ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగును ప్రసారించే ఈ సేవా యజ్ఞం, గ్రామస్థుల నుంచి ప్రశంసలు పొందింది. ఈ కార్యక్రమంలో జన సందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాన్నే భాషయ్య, డాక్టర్ మధుసూదనా రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి కారింగు రాజు గౌడ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షులు బండి రాజ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ పోలగోని రామచంద్రయ్య, ఆర్గనైజర్ అశ్వల బాలరాజు, కన్వీనర్ మోర శ్రీశైలం, మాజీ బూత్ అధ్యక్షులు సుంకర మహేష్ గౌడ్, భాను, చెరుకు జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

### -అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిషేధం
### - కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నియమ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంబంధిత ఏసీపీ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలను నిర్వహించకూడదని స్పష్టం చేశారు. అనుమతులు తీసుకోవడం ద్వారా పోలీసు శాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ ఉత్తర్వుల అమలులో ఇతరులను గాయపరిచే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదని, రోడ్లు మరియు ప్రజలకు ఉపయోగపడే ఇతర ప్రదేశాల్లో జన సమీకరణ నిషిద్ధమని తెలిపారు. అనుమతి పత్రాల్లో పేర్కొన్న ప్రాంతాల్లో మ్యూజిక్‌లు, ప్రసంగాలు, పాటలు, రణగొణ ధ్వనులు చేయరాదని హెచ్చరించారు. ఈ ఆంక్షలు నవంబర్ 30 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమీషనర్ స్పష్టం చేశారు.

# ఓ మహాత్మా ప్రభుత్వానికి కళ్ళు తెరిపించండి

### బీసీ యువజన సంఘం వినతి పత్రం

**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసి పెద్ది శ్రీదర్ రాజ్, జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. 2008లో ప్రారంభమైన స్కీమ్‌ను గత ప్రభుత్వాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చే



ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నిధుల లేమితో కళాశాలలు మూతపడుతున్నాయని, బోధనా సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మియాపురం రవీంద్ర చారి, యువజన సంఘం కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సింగంపల్లిలో గ్రామ సభ



**ఆమనగల్లు, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి అభిషేక్ నేతృత్వంలో గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, కార్బన్ క్రెడిట్లు, లింక్ రోడ్లు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష



జరిగింది. మురుగు నీటి సమస్యకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. బీటీ రోడ్ మంజూరైనప్పటికీ బస్సు తిరిగే ప్రాంతానికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని గ్రామస్థులు అభ్యర్థించారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమ మాధురి, ఏపీవో మాధవ్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్, జయమ్మ, వినోద్ రెడ్డి, నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

## విమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో ఆర్.ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యూపీఎస్ చామనపల్లి పాఠశాలలో ఈరోజు ఆర్.ఓ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఎఫ్.డి.ఎన్.ఎఫ్ స్విట్జర్లాండ్ సంస్థ సౌజన్యంతో, విమెన్ డెవలప్మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ ఏర్పాటు జరిగింది.పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన తాగునీరు అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు.వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్, ఉపాధ్యాయులు బుర్ర నాగరాజు, శ్రీనివాస్, రమాదేవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గంగుల కమలాకర్‌ను కలిసిన అర్బన్ బ్యాంక్ పాలకవర్గం



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులు నేడు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ కర్ర రాజశేఖర్ సహా సభ్యులను శాలువ కప్పి సత్కరించి, అభినందనలు తెలిపారు.బ్యాంకు అభివృద్ధితో పాటు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలన్నది తమ లక్ష్యమని, పాలకవర్గం నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా బ్యాంకు సేవలు కొనసాగాలని సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గంగుల కమలాకర్, చైర్మన్ కర్ర రాజశేఖర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బస్సు బాధితులకు జాగృతి పరామర్శ



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్‌లో జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పరామర్శించారు. ఆర్టీసీ బస్సులపై అధిక ఒత్తిడి, అదనపు డ్యూటీలే ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి జిల్లా నుంచే ఉన్నందున బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, నాయకులు చంటి శ్రీనివాస్, కుతాడి శ్రీనివాస్, గాల్లపల్లి రత్నాకర్, హస్నాబాద్ రాజ్ కుమార్, కొత్తురి రఘు, దుర్శెట్టి లక్ష్మణ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు




**దేవరకొండ నవంబర్ 04.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలో పిఎంసిశ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం ఎమ్ హెచ్ ఆర్ డి స్కీం కింద దేశవ్యాప్తంగా లక్ష స్కాలర్షిప్లు ఇస్తుంది.ఈ ఎగ్జామ్ కి ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎనిమిదో తరగతి డేస్ కాలర్స్ విద్యార్థులు ఎలిజిబుల్ అవుతారు. ఈ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన మరియు క్వాలిఫై అయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నెలకి 1000 చొప్పున నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వ పరిధిలో చదువుకుంటే అనగా (తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు) స్కాలర్షిప్ అనేది వస్తుంది.......

ఇందులో భాగంగా ఈరోజు జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థిని విద్యార్థులకు యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో ఎన్ ఎమ్ ఎంఎస్ ( నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిఫ్) మెటీరియల్ ను అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిండి ఎమ్మార్వో హనుమంతు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని ప్రతి ఒక్కరు ఈ యొక్క పరీక్షలో ఉతీర్ణత సాధించాలి అని తెలిపారు ఈ యొక్క కార్యక్రమం లో యూత్ పర్ సేవా వాలంటీర్స్ తాడిశెట్టి సుదర్శన్ ,ఏటి రాధికా, కడారి శ్రీశైలం,గాయాల రాఘవేంద్ర , కాసుల శంకరయ్య మరియు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా సైన్స్ ఎగ్జిబిషన్

### వనపర్తిలో మూడో వారంలో నిర్వహణ – డీఈఓ అబ్దుల్ ఘని




**వనపర్తి, నవంబర్ 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ (2025-26) మరియు ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన (2024 -25)లను నవంబర్ మూడో వారంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, తెలంగాణ మోడల్, కేజీబీవీ, ప్రైవేటు పాఠశాలల 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. ఈ సంవత్సరం ప్రదర్శనకు "స్టెమ్ ఫర్ వికసిత్ & ఆత్మనిర్భర్ భారత్" అనే అంశాన్ని ప్రధానంగా తీసుకున్నామని, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణిత రంగాల ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ప్రాజెక్టులు రూపొందించాల్సిందిగా సూచించారు. పాఠశాలలవారీగా నూతన ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులు సిద్ధం చేసి ప్రదర్శనలో పాల్గొనవచ్చని తెలిపారు. ఒక్కో పాఠశాల నుండి గరిష్ఠంగా ఆరు ప్రాజెక్టులు మాత్రమే ఎంపిక చేయాలని, ప్రతి పాఠశాల నుండి ఒక గైడ్ టీచర్ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.ఇన్స్పైర్ ప్రదర్శనలో జిల్లాలో ఎంపికైన 124 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నాయని, ఎంపికైన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు డీఈఓ తెలిపారు. ప్రదర్శన రెండవ రోజు విద్యార్థుల కోసం "ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం" అనే అంశంపై వన్ డే సెమినార్ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎం. శ్రీనివాసులు (ఫోన్: 9394574814)ని సంప్రదించవచ్చని డీఈఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

### ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు



**వర్ధన్నపేట, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు అన్నారు. మంగళవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రశాంత్- శాంతి ప్రియ దంపతులకు ఎగ్ కార్ట్ ను అందజేశారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేటర్ కమిటీ (ఎన్ఈసీసీ) వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆదేశాల మేరకు ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ముఖ్య అదితిగా హాజరై టీ టైమ్ సమోసా కార్నర్ షాపును ప్రారంభించి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి వినీత్ రావు మాట్లాడుతూ చిరువ్యాపారులు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబానికి ఆసరాగా నిలవాలని అన్నారు.అందుకే ఎగ్ కార్ట్స్ ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు కు యాజమాన్యం శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెంచికాల కుమారస్వామి, తూళ్ల కుమారస్వామి, రాయపూరపు కుమారస్వామి,మాజీ ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్,బేతి సాంబయ్య, ఏరుకొండ వేణుగోపాల్ రావు,నాంపెల్లి యాకయ్య, పెద్దగోని కవిరాజు,అడుప రాజు, నాంపెల్లి శ్రీనివాస్, పిట్టల రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# వరుస ప్రమాదాలతోనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి

### మీర్జాగూడ బస్సు ప్రమాదంపై సిపిఐ స్పందన



**కుత్బుల్లాపూర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని మీర్జాగూడ గేటు వద్ద నిన్న జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి తరఫున గాంధీనగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, కొద్ది రోజుల్లోనే వరుస బస్సు ప్రమాదాలు జరగడం, మృతుల సంఖ్య అధికంగా ఉండడం సమాజాన్ని కలిచి వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదం జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేయడమే గాని, అనంతరంగా రోడ్లపై రెగ్యులర్ చెకప్‌లు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. మీర్జాగూడ వద్ద ప్రమాదానికి కారణమైన భారీ గుంతను గుర్తుచేస్తూ, ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా పేరుతో డబ్బులు ఇచ్చి బాధ్యతల నుంచి తప్పించుకోకుండా, నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.రవాణా శాఖ అధికారులు నిత్యం చెకప్‌లు నిర్వహిస్తే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. ఒకే కుటుంబానికి చెందినవారు ప్రాణాలు కోల్పోవడం, అనేకమంది తమ కుటుంబ సభ్యులను కోల్పోవడం బాధాకరమని, వారి ఆవేదనలకు ప్రభుత్వం స్పందించాలని కోరారు. బాధిత కుటుంబాలకు సిపిఐ తరఫున సంతాపం తెలియజేస్తూ మృతులకు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కే. స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు హరీష్ రెడ్డి, మల్లారెడ్డి, గౌస్, ఎల్లయ్య, వెంకటేష్, జంబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ...
## భద్రాద్రి సీత రామయ్య సేవలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహిళలు





శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామి సన్నిధిలో సేవా కార్యక్రమాల్లో



**హైదరాబాద్,నవంబర్ 04 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవితం పొందవచ్చని రంగారెడ్డి జిల్లా కర్మన్ ఘాట్ చెందిన బండారు మంజుల , కొండూరు శ్రీదేవి ... అన్నారు. కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామి సన్నిధిలో మరియు భద్రాద్రి సీతారామచంద్రస్వామి , దేవాలయంలో కూడా సేవా చేయడానికి మాకు అవకాశం దక్కినందుకు శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామి సీతారామచంద్రస్వామి ధన్యవాదాలు తెలిపారు.



గోదావరి నది ఒడ్డున గంగా హారతి

# చాయ్ అమ్మిన బాలుడు నుంచి చరిత్ర సృష్టించిన నాయకుడు!

## భారత గౌరవం మోసే నరేంద్ర మోదీ గారి అద్భుత ప్రస్థానం

### బాల్యం - ఒక చిన్న గ్రామంలో పుట్టిన పెద్ద కల





1950 సెప్టెంబర్ 17 గుజరాత్‌లోని చిన్న గ్రామం వడ్నగర్.
అక్కడే జన్మించారు నరేంద్ర దామోదర్దాస్ మోదీ.
తండ్రి దామోదర్దాస్ ముల్చంద్ మోదీ చాయ్ అమ్మేవారు.
రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తండ్రితో కలిసి టీ అమ్ముతూ పెరిగిన చిన్న బాలుడు – జీవితం అంటే కష్టం, కృషి అంటే గౌరవం అని నేర్చుకున్నాడు.
"ఏ పని చిన్నది కాదు, ఆలోచన పెద్దదిగా ఉండాలి" అనే తత్త్వం అప్పుడే ఆయనలో పుట్టింది.

**యువకుడిగా – సేవా దృక్పథం, దేశభక్తి మూలం**

చిన్న వయసులోనే మోదీ గారు రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (RSS) లో చేరి క్రమశిక్షణ, సేవ, దేశభక్తిని జీవితమంతా ఆచరించారు.
గ్రామాలు, గిరిజన ప్రాంతాలు తిరుగుతూ ప్రజల కష్టాలు చూశారు. అదే ఆయన రాజకీయ ప్రవేశానికి బీజం వేసింది.
"సేవే పరమ ధర్మం" అనే సూత్రాన్ని ఆయన జీవితం అంతా ప్రతిబింబించింది.

**గుజరాత్ ముఖ్యమంత్రిగా – అభివృద్ధి విప్లవానికి నాంది**

2001లో భూకంపం తర్వాత శిథిలావస్థలో ఉన్న గుజరాత్‌ను తిరిగి నిలబెట్టింది ఒకే వ్యక్తి ‌ి మోదీ గారు.
గుజరాత్ మోడల్ ఆఫ్ డెవలప్‌మెంట్ అనే కొత్త దారిని చూపారు.
పరిశ్రమలు, విద్యుత్, రోడ్లు, నీటి వనరులు, వ్యవసాయం
ప్రతి రంగంలో దూకుడు చూపించి రాష్ట్రాన్ని భారత అభివృద్ధి చార్టులో అగ్రస్థానానికి చేర్చారు.

**భారత ప్రధానమంత్రిగా –నూతన భారత్ స్వప్నం**

2014లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది.
అప్పటి నుండి మోదీ గారు దేశానికి ప్రధానమంత్రిగా మారి "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" అనే నినాదాన్ని భారత ప్రజాస్వామ్యానికి మూల సూత్రంగా నిలబెట్టారు.
ఆయన మాటల్లో –
**"నా పాలన ప్రజల కోసం, ప్రజలతో, ప్రజల చేతే జరుగుతుంది."**

**దేశాన్ని మార్చిన అద్భుత కార్యక్రమాలు**

- స్వచ్ఛ భారత్ అభియాన్ – శుభ్రమైన, ఆరోగ్యమైన భారత్ దిశగా మహా ఉద్యమం.
- మేక్ ఇన్ ఇండియా – దేశంలో తయారీ పరిశ్రమలకు ప్రోత్సాహం, ఉద్యోగావకాశాల సృష్టి.
- డిజిటల్ ఇండియా – టెక్నాలజీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లిన సాంకేతిక విప్లవం.
- ఉజ్వల యోజన – పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లతో కొత్త వెలుగు.
- జన్ ధన్ యోజన – ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా అనే ఆర్థిక సురక్షా.
- ఆత్మనిర్భర్ భారత్– స్వదేశీ ఉత్పత్తుల ద్వారా స్వావలంబన వైపు అడుగులు.

**ప్రపంచ వేదికపై భారత్ ముద్ర**

మోదీ గారి నాయకత్వం భారతదేశాన్ని ప్రపంచ పటంలో శక్తివంతమైన దేశంగా నిలబెట్టింది.
అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్ వంటి దేశాలతో బలమైన సంబంధాలు ఏర్పడ్డాయి.
ఇంటర్నేషనల్ యోగా డే, G20 సమ్మిట్ వంటి వేదికలపై ఆయన నాయకత్వం ప్రపంచాన్ని ఆకట్టుకుంది.
ప్రతి విదేశీ పర్యటన వెనుక ఉన్నది భారత్ గౌరవం, భారత్ ప్రగతి.

**మోదీ యుగం - అద్భుత విజయాల పరంపర**

భారత్ మూడో శక్తిమంత దేశం – అమెరికా, రష్యాల తరువాత గర్వంగా నిలిచిన భారత్.
ఆర్థిక అద్భుతం – జీఎస్టీ వసూళ్లు 1.5 లక్షల కోట్ల దాకా చేరిన ఘనత.

- సౌర శక్తి సింహాసనం –అమెరికా, జపాన్‌లను వెనక్కి నెట్టి రెండో స్థానం.
- జీడీపీ జంప్ – 8.2% వృద్ధితో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారత ఆర్థిక వ్యవస్థ.
- త్రిశక్తి సామర్థ్యం – భూమి, నీరు, ఆకాశం మూడు మార్గాల్లో క్షిపణి ప్రయోగ సామర్థ్యం కల దేశం!
- రక్షణ దృఢత్వం – సైన్యానికి బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, ఆధునిక ఆయుధ వ్యవస్థలు.
- జాతీయ భావ జాగృతి – "హిందూస్థాన్" అనే పదంలో మళ్లీ గర్వాన్ని నింపిన నాయకుడు.

**మోదీ గారి మూడు మంత్రాలు**

క్రమశిక్షణ
స్వీయ విశ్వాసం
దేశ సేవ

**ఆయన తత్త్వం**

"పుట్టుక కాదు కృషే మన గమ్యాన్ని నిర్ణయిస్తుంది."

**ముగింపు - దేశ గౌరవమే మోదీ గౌరవం**

చాయ్ అమ్మిన చిన్న బాలుడు, నేడు ప్రపంచం గౌరవించే నాయకుడు.
ఆయన జీవితం ప్రతి భారతీయుడికి ఓ స్ఫూర్తి.
కష్టపడి, అంకితభావంతో పనిచేస్తే ఏ కలనైనా సాధించవచ్చని ఆయన నిరూపించారు.

**మోదీ గారి ప్రస్థానం**

పాలన కాదు, ఇది ఒక యుగం!
భారత గౌరవం, భారత శక్తి, భారత ఆత్మ ‌ి ఈ యుగంలో కొత్తగా రూపుదిద్దుకుంది.

**వ్యాసకర్త**

చెరుకు జంగయ్య గౌడ్
సామాజిక కార్యకర్త



# విద్యాసంస్థల బంద్‌కు యుఎస్ఎఫ్ఐ మద్దతు

**తక్షణమే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి-సంద గణేష్**




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యాసంస్థల యజమాన్యాలు చేపట్టిన బంద్‌కు మద్దతుగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ గేటు వద్ద పుస్తకాలు పట్టుకొని నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంద గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల చదువులు నష్టపోకుండా ప్రభుత్వం తక్షణమే యజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.7213 కోట్ల రియంబర్స్మెంట్ పెండింగ్‌లో ఉండడం, విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటు అని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉమ్మడి జిల్లా మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.నిరసనలో నగర కార్యదర్శులు అల్లపు అభిలాష్, భూష, మనితేజ, హిమంత్, రాకేష్, ఉమామహేశ్వర్, శన్విత్, సూరత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించండి

**- సీఎం రేవంత్‌కు ఏఐఎస్ఎఫ్ లేఖ**
**-పోస్టు ద్వారా వినతి, బకాయిలపై నిరసన**




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు పోస్టు ద్వారా లేఖ పంపారు. విద్యార్థుల చదువులను ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిందని, కళాశాలలు మూతపడే స్థితి ఏర్పడిందని జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రోజుల్లో బకాయిలు విడుదల చేయకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమని, ఫీజు బకాయిల వల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు కేషబోయిన రాము యాదవ్, నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, శివ, రాజు, మల్లికార్జున్, మని, వరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పొన్నం మంత్రి పదవికి రాజీనామా చేయాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెండింగ్‌లో ఉన్న రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి వద్ద ముట్టడి నిర్వహించారు. పోలీసులు అడ్డుకుని నిరసనకారులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పట్టించుకోని మంత్రి పొన్నం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 8600 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. విడుదల చేయకపోతే స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు వినయ్ సాగర్, భోగేష్, కమిటీ సభ్యులు రత్నం సురేష్, రాకేష్, సందేశ్, సన్నీత్, సంతోష్, హరీష్, నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జరుపుల తండాలో రోడ్డు మరమ్మతులపై ప్రజల విజ్ఞప్తి

**మక్తతండా-అర్కపల్లి మార్గంలో ఇబ్బందులు**



**మాడుగుల, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల మండలంలోని జరుపులతండ గ్రామపంచాయతీ పరిధిలో మక్తతండా నుండి అర్కపల్లి వెళ్లే రోడ్డు మధ్య భాగంలో మంగ్తతండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్ శంకుస్థాపన చేసిన ఈ రోడ్డు పనులు ప్రభుత్వం మారిన తర్వాత నిలిచిపోయాయని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో ఈ అంశంపై చర్చ జరిగినప్పటికీ, ఇప్పటికీ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో మంగ్తతండా, జరుపులతండా, అందుగుల, కుబ్య తండ, అర్కపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.కార్యక్రమంలో పాండు నాయక్ (వార్డు సభ్యులు), మేరావత్ రాజు, ఇ దేవ్ల, ఇ సేవ్య, యం దీప్ల యం, లాలు, యం రేఖ్య, వి లక్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బైపాస్ సర్జరీ కోసం 8 యూనిట్ల రక్తదానం

**యువత సేవా భావానికి అభినందనలు**




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బైపాస్ సర్జరీ కోసం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజయ్య అనే పేషెంట్ కోసం కుతాడి రాజశేఖర్ నేతృత్వంలో 8 మంది యువకులు జివికె బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. సేవా కార్యక్రమంలో గుడిసె శేఖర్, జెట్టి అభినంద్, బొమ్మరవేణి మహేష్, కుర్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి కొత్తపల్లి జోన్ అధ్యక్షుడు ముత్తునూరి హరీష్ యువతను అభినందిస్తూ "ఒక ప్రాణం కోసం ఎంతోమంది ముందుకు రావడం గొప్ప విషయం. సమయానికి రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో యువత రక్తదానంలో ముందుండాలి" అని సూచించారు.

# ఎన్‌హెచ్ 563 రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలి

**ప్రజల ప్రాణాలకు ప్రమాదం- బీజేపీ నేత మారుతి**





**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చింతకుంట నుంచి జగిత్యాల వరకు నేషనల్ హైవే 563 రోడ్డును బీజేపీ ఎస్సి మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దుర్గం మారుతి పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి పద్మనగర్ మానేరు స్కూల్ వరకు, 2009లో నిర్మితమైన ఈ రోడ్డుకు ఇప్పటివరకు మరమ్మత్తులు జరగకపోవడంతో గుంతలతో ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.నేషనల్ హైవే అథారిటీ, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్తంగా రోడ్డును పర్యవేక్షించి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని, ప్రజల ప్రాణాలు రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ తరఫున విజ్ఞప్తి చేశారు.

# పోక్సో చట్టం అమలులో పాఠశాలల పాత్ర కీలకం

**సైబర్ క్రైమ్ నియంత్రణలో అప్రమత్తత అవసరం-జడ్జి వెంకటేష్**




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించే పోక్సో చట్టం, జువైనల్ జస్టిస్ చట్టం, సైబర్ క్రైమ్ నియంత్రణ అంశాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. వెంకటేష్, విద్యార్థుల భద్రతపై పాఠశాలల నైతిక, చట్టపరమైన బాధ్యతను వివరించారు.లైంగిక వేధింపుల ఫిర్యాదులపై స్పందించే విధానాలు, సైబర్ బులీయింగ్, నకిలీ ప్రొఫైల్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫిర్యాదులకు భయంలేని వ్యవస్థ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ 15100 ద్వారా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య, లీగల్ ఎయిడ్ డిప్యూటీ కౌన్సిల్ మహేష్ తణుకు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ అధికారులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష**




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 7న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో కలెక్టర్ పమేలా సత్పతి అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్, వైద్య, శానిటేషన్, భద్రత, ఫాగింగ్, డయాస్ ఏర్పాట్లు తదితర అంశాలపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనివర్సిటీలో ఐడెంటిటీ కార్డులు ఉన్నవారికే ప్రవేశం కల్పించాలని, గేటు వద్ద తనిఖీ కోసం సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాజరయ్యే అతిథుల జాబితా ముందుగానే సమర్పించాలని పేర్కొన్నారు.యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ గవర్నర్ ఉదయం 10 గంటలకు చేరుకుంటారని, గోల్డ్ మెడల్స్, పీహెచ్‌డీ పట్టాల ప్రదానం అనంతరం గవర్నర్ ప్రసంగం, సెమినార్ హాల్ ప్రారంభం ఉంటుందని తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు, డీఆర్ఓ, ఆర్డీవో, డిసిపి, ఏసీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

**కార్యకర్తలకు పిలుపునిచ్చిన చాడ వెంకటరెడ్డి**



**పెద్దపల్లి, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి తెలిపారు. పెద్దపల్లి భాస్కరరావు భవన్లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల జీపు జాత నవంబర్ 16న గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలకు రానున్న నేపథ్యంలో కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగిస్తున్నదని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కలవేన శంకరన్న, తాండ్ర సదానందం, గౌతమ్ గోవర్ధన్, గోష్కమోహన్, కడారి సునీల్, తాళ్లపల్లి మల్లయ్య, మడ్డి ఎల్లయ్య, మార్కపురి సూర్య, ఇతర జిల్లా నేతలు పాల్గొన్నారు.

# తండా వాసుల దాహం తీర్చిన ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

**-లింగరావుపల్లి తండాలో బోర్ ఏర్పాటు**



**తలకొండపల్లి, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తలకొండపల్లి మండలం లింగరావుపల్లి తండాలో త్రాగునీటి కొరత ఉన్న విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలియజేయగా, శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసరెడ్డి స్పందించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చర్యలు తీసుకుని మంగళవారం బోర్ పాయింట్ వేయించడంతో నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. తండా వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, మణికంఠ యాదయ్య, జలందర్ రెడ్డి, జంగయ్య, సాయిలు, చంద్రశేఖర్, శేఖర్, ప్రవీణ్ కుమార్ గౌడ్, అంజయ్య, లాల్యా, జమిలి దేవి, రాములు, రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

**-ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన సిపిఎం**




**కల్వకుర్తి, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అధిక వర్షాలతో పత్తి, వరి పంటలు తీవ్రంగా నష్టపోయాయని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆర్డీవో జనార్దన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.పత్తి పంట దిగుబడి తీవ్రంగా తగ్గిందని, ఎకరాకు 50,000 నష్టపరిహారం ఇవ్వాలని, వరి పంట నష్టపోయిన రైతులకు 30,000 చెల్లించాలని కోరారు. ఐదు మండలాల్లో సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. రైతు సంఘం అధ్యక్షుడు చిలుక బాల్ రెడ్డి మాట్లాడుతూ కంపాస్ కిసాన్ యాప్ రద్దు చేసి, సిసిఐ ద్వారా నేరుగా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏపీ మల్లయ్య, పరశురాములు, రైతు సంఘం నాయకులు కిషోర్, చెన్నయ్య, పర్వతాలు, బీరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ప్రాణాలతో చెలగాటం

**- ఎంఎస్ఎఫ్ ఆగ్రహం**
**-రావుస్ స్కూల్ వ్యాన్‌పై చర్యలు తీసుకోవాలి**




**గోదావరిఖని, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యాన్ వెనుక అద్దం లేకుండా నడుస్తుండటం, ఆర్టీవో ఫిట్నెస్ లేకుండా రోడ్లపై ఉండటం విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదకరమని ఎంఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండ్ల రాకేష్ తీవ్రంగా ఖండించారు. పేరుకే కార్పొరేట్ స్కూల్, ఫీజులు లక్షల్లో వసూలు చేస్తూ, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అట్టి వ్యాన్లను సీజ్ చేయాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# నిరుపేద కుటుంబానికి ఏఎస్ఐ శ్రీనివాస్ చేయూత

**వాసవి సేవాదళ్ ద్వారా 47,969 సేకరణ**



**జగిత్యాల, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పురానిపేటలో నివసిస్తున్న మార రమేష్, వసంత దంపతులు ఆర్థికంగా కష్టాల్లో ఉన్న నేపథ్యంలో, వైద్య చికిత్స కోసం అవసరమైన 1 లక్ష ఖర్చు కోసం ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ వాసవి సేవాదళ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా 47,969 సేకరించారు. ఈ మొత్తాన్ని స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ఎండ్. ఆరిఫ్ అలీ ఖాన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.శ్రీనివాస్ సేవా కార్యక్రమాలను కొనియాడిన అధికారులు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిహెచ్. సతీష్, ఎస్సైలు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ స్కూల్‌లో కార్తిక పౌర్ణమి వేడుకలు




**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, దీపారాధన చేసి శివుని చిత్రపటానికి పూలమాలవేసి ప్రారంభించారు.కార్తిక మాసం పవిత్రత, దీపారాధన ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా, పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐకెపి సెంటర్లలో రైతుల గోడు

**-బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్**
**-వడ్ల కొనుగోలులో జాప్యం, సౌకర్యాల లేమిపై ఆగ్రహం**



**హుస్నాబాద్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్కతుర్తి మండలంలోని ఐకెపి సెంటర్లను సందర్శించిన బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, వడ్ల కొనుగోలులో జాప్యం, కనీస సౌకర్యాల లేమిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజులుగా వడ్లు నిల్వ ఉన్నా మిల్లుల అలాట్మెంట్ లేక కొనుగోలు జరగడం లేదని, టార్పన్ పరదలు లేక వడ్లు తడిసిపోతున్నాయని రైతులు వాపోయారు. రైతుల పంటలు కొనకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలులో జాప్యం కొనసాగితే ధర్నాలకు సిద్ధమని హెచ్చరించారు.కార్యక్రమంలో కంచర్ల శంకరయ్య, జనగాం కిష్టయ్య, కోడం రమేష్, ఠాకూర్ సామ్సంగ్, అంబిర్ శ్రీనివాస్, అల్లికుమార్, దాసరి సాయి తేజ, బాడిశే కుమారస్వామి, మన్నుర్తి తిరుపతి యాదవ్, రైతులు పాల్గొన్నారు.

# రైతుల పరిస్థితి దారుణం

**- జాతీయ విపత్తుగా ప్రకటించాలి**
**-పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్**



**హుస్నాబాద్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వరుస తుఫాన్లతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, చేతికందే పంటలు నీళ్లపాలై, గూడు నేలమట్టమై, పాడిపశువులు వాగులపాలవుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు, పశువులు, నిలువ నీడ లేని ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి భారీ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

# 8500 కోట్ల పెండింగ్ స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్ విడుదల చేయాలి


**-ఆర్ డి ఓ కు వినతి.**
**-సామాజికవేత్త జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.**




**దేవరకొండ నవంబర్ 04.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి విద్యార్థుల 8500 కోట్ల స్కాలర్షిప్ , ఫీజ్ రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు టైగర్ ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు దేవరకొండ పట్టణంలో ఆర్ డి ఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఆర్డిఓ రమణారెడ్డి కి వినతి పత్రం అందజేశారుఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి బీసీ , ఎస్సీ , ఎస్టీ , మైనారిటీ విద్యార్థులకు ఇంటర్ , డిగ్రీ , పిజి , ఇంజనీరింగ్ ,ఫార్మసీ వంటి కళాశాలలో చదివేటటువంటి విద్యార్థిని , విద్యార్థులకు స్కాలర్షిప్స్,ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు, ప్రవేట్ కళాశాల యాజమాన్యాలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విధంగా బలహీన వర్గాల విద్యార్థులపై ప్రభుత్వం వివక్షత చూపడం సరికాదని తెలిపారు .తక్షణమే ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సామాజిక ఆర్థిక కోణంలో ఆలోచించి తక్షణమే పెండింగ్ బకాయిలు ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు లేనియెడల పెద్ద ఎత్తున వేలాదిమంది విద్యార్థులతో జాతీయ రహదారుల దిగ్బంధం మరియు ఆందోళనలు , రాస్తారోకలు చేపడతామని ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో చోళ్ళేటి భాస్కర చారి , వరికుప్పల ఆర్మీ శ్రీను, రెడ్డి కోటేశ్వరరావు, లావుడియా భాష చౌహన్ ,అబ్దుల్ కలాం , భీమ గోని శివ గౌడ్, పెరికేటి శ్రీనివాసాచారి, ప్రైవేట్ కళాశాల యాజమాన్యం, మోర వెంకటేష్ యాదవ్, ఆడారపు గణేష్ , కేతావత్ కశ్న నాయక్ , నల్ల శాంతి రాజు , నేతాల్ల రాంబాబు, విట్టల్ , జమాల్ పాషా , కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాత నిధులకే కొత్త జి.ఓ హంగులు

## అశోక్ ఫైర్



**వనపర్తి, నవంబర్04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** నీలగిరి ఎక్స్ ప్రెస్ పాలిటెక్నిక్ నిధులపై ప్రజలను మభ్యపెడుతున్నారని వనపర్తి జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ఎం.ఎల్.ఏ మేఘారెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ, వసతి గృహాల పునర్నిర్మాణం కోసం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రత్యేక కృషితో జి.ఓ. Rt.No.335, తేదీ 11.08.2023 ద్వారా 22 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఇప్పటికే మంజూరైన నిధులను కొత్త జి.ఓ. పేరుతో తమ అభివృద్ధిగా ప్రచారం చేయడం విడ్డూరమని ఆయన ఎద్దేవా చేశారు."జి.ఓ. నంబర్ మారితే అభివృద్ధి మీ ఖాతాలో పడుతుందా ఎం.ఎల్.ఏ గారు?" అని అశోక్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిధులను తమ విజయంగా చెప్పుకోవడం సిగ్గుచేటని, కొత్త అభివృద్ధి పనులు తెచ్చి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన హితవు పలికారు.

# ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో ఫ్రెషర్స్ డే ఉత్సాహం

**బిఎ విద్యార్థులకు స్వాగతం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి**



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్.ఆర్.ఆర్. గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (ఆటోనమస్), కరీంనగర్‌లో బిఎ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విద్య, క్రమశిక్షణ, సాంస్కృతిక చైతన్యం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని సూచించారు. టీ.జి.సి.జి.టి.ఏ. ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కళాశాల జీవితం భవిష్యత్తుకు పునాది అని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ఆర్ట్స్ విభాగ అధ్యాపకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు, నాటికలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం ధన్యవాదాలతో ముగిసింది.

# నాసిరకం కోడిగుడ్లపై చర్యలు తీసుకోవాలి

**సిడిపిఓకి విజ్ఞప్తి చేసిన బిఎస్పీ, బిజెపి నాయకులు**







**హుస్నాబాద్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలకు కుళ్లిపోయిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బిఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు సిడిపిఓ జయప్రదకు విజ్ఞప్తి చేశారు. నవజాత శిశువులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు సరైన పౌష్టికాహారం అందక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని బాధితులు తెలిపారు. నాసిరకం కోడిగుడ్ల పంపిణీ చేసిన కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అనంతస్వామి, బిఎస్పీ నాయకులు ఎలగందుల శంకర్, బాధితుడు పోలోజు రాజేందర్ పాల్గొన్నారు.


# రావి ఆకుపై చిత్రంతో మహిళా జట్టుకు శుభాకాంక్షలు




**హైదరాబాద్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్ విజేతగా భారత మహిళల జట్టు చరిత్ర లిఖించిన వేళ, ఆ విజయాన్ని పురస్కరించుకుని కళ్లెం ధర్మనీల సోదరి దనూజ రావి ఆకుపై అద్భుత చిత్రాన్ని రూపొందించింది. పైన ట్రోఫీ, కింద "ఉమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ ఇండియా 2025" అని ఆర్ట్ చేసి దేశభక్తిని చాటింది. ఇండియా జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన ఆమెను పలువురు అభినందించారు.

# ఐవీఎఫ్ కేంద్రాలపై స్పెషల్ డ్రైవ్ తనిఖీలు

**-చట్ట ఉల్లంఘనలపై చర్యలు తప్పవు**
**-డాక్టర్ వెంకటరమణ**



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ టీం కరీంనగర్ పట్టణంలోని ఐవీఎఫ్ కేంద్రాలను తనిఖీ చేసింది. తనిఖీలో అల్ట్రాసౌండ్ యంత్రాల పనితీరు, రిజిస్టర్లు, పేషెంట్ అనుమతి పత్రాలు, ఫామ్ (ఎఫ్) పత్రాలు, కేస్ రికార్డులు, నిపుణుల సర్టిఫికెట్లు, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పరిశీలించారు. లింగ ఎంపిక నిషేధ చట్టం (1994), మెడికల్ టర్మినేషన్ చట్టం, అసిస్టెంట్ రిప్రొడక్టివ్ మార్గదర్శకాలు పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ సనజవేరియా, రమేష్, సయ్యద్ సాబీర్ పాల్గొన్నారు. తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతాయని తెలిపారు.

# ఎంపీడీవో సుమలతకు శుభాకాంక్షలు

**అంతర్గాం మండల కాంగ్రెస్ నాయకుల సత్కారం**



**అంతర్గాం, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంతర్గాం మండలానికి నూతనంగా నియమితులైన ఎంపీడీవో వి. సుమలత మేడాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్-చైర్మన్ మడ్డి తిరుపతి, కో-ఆర్డినేటర్ గాదె సుధాకర్, భూక్యా శారదా-శంకర్ నాయక్, జూల లింగయ్య, కొత్తపల్లి రాజు, మల్రి రాజ్ కుమార్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నతి శిక్ష ఫౌండేషన్ సేవా కార్యక్రమం

**తలకొండపల్లి, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, హై స్కూల్‌లకు ఉన్నతి శిక్ష ఫౌండేషన్ మౌలిక వసతులు అందించింది. ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బోర్డులు, టేబుల్స్, కుర్చీలు, రాక్స్, స్పోర్ట్స్ మెటీరియల్, వాటర్ ఫిల్టర్ మరమ్మతులు, గదులకు పెయింటింగ్ వంటి సేవలు అందించారు. విద్యార్థులు బాగా చదివి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్, కార్యదర్శి బండి రఘుపతిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. మంది ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# "వనపర్తి పాలిటెక్నిక్ విద్యార్థులకు కొత్త వసతి గృహాలు

**- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు"**
**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి, నవంబర్ 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల బాలుర, బాలికల వసతి గృహాల నిర్మాణానికి తెలంగాణ సర్కార్ రూ.13.15 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖ GO RT No.169 జారీ చేసింది. విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో వనపర్తి విద్యార్థులకు ఆధునిక వసతి సదుపాయాలు అందనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

# బహిరంగ మద్యం పానంపై నిషేధం కొనసాగింపు

**-డీజే, డ్రోన్ల వినియోగంపై కూడా నిషేధం**
**-కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజే వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 30 వరకు పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు. మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తిస్తున్న మద్యంప్రియుల వల్ల మహిళలు సహా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే, భద్రతా కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, డ్రోన్స్, మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్టల వినియోగాన్ని కూడా నిషేధించినట్లు తెలిపారు. వివాహాది శుభకార్యాల్లో వీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉగ్రవాద, అసాంఘిక శక్తుల దుర్వినియోగం నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వినియోగించదలచిన వారు సంబంధిత పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపిసి సెక్షన్ 188 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# టెన్నిస్ క్రికెట్‌లో ట్రినిటీ విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

**ఇంటర్-డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో రెండవ స్థానం**



**కరీంనగర్, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహబూబాబాద్‌లో నవంబర్ 2న టెన్నిస్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ఇంటర్-డిస్ట్రిక్ట్ స్కూల్ టెన్నిస్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ (యూ-14) పోటీలో ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్, సాలేహనగర్ విద్యార్థులు రెండవ స్థానం సాధించి ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. విజయాన్ని అభినందించినవారిలో చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. మమతా రెడ్డి, ప్రిన్సిపాల్ రత్నమాల, కోఆర్డినేటర్ శ్రీకాంత్ (పీఈటీ), సురేందర్ సింగ్, మహేందర్ నాయక్ ఉన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా ట్రినిటీ సంస్థలు ముందుకు సాగుతున్నాయని చైర్మన్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలుకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

**150o కేంద్రాలు, బోనస్‌తో సన్నరకం వడ్లకు ప్రోత్సాహం**



**మంచిర్యాల, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2025-26 వరి ధాన్యం కొనుగోలు సీజన్‌కు జిల్లాలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 97, డీసీఎంఎస్ ద్వారా 63, మెప్మా ద్వారా 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు.జిల్లాలో 1,57,642 ఎకరాల్లో వరి సాగు జరిగి, 2,32,743 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గ్రేడ్ రకానికి క్వింటాలుకు 2,389, సాధారణ రకానికి 2,369 మద్దతు ధర, సన్నరకం వడ్లకు అదనంగా 500 బోనస్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ధాన్యం నిల్వ, తూకం, తేమ కొలవడానికి అవసరమైన పరికరాలు, గోనె సంచులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్లు, తూకం యంత్రాలు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కోసి, శుభ్రపరచి, టోకెన్లు పొంది సకాలంలో విక్రయించాలని రైతులకు సూచించారు.అవకతవకలు నివారించేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించామని, అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 24 గంటల బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్లు 1967, 1800 4250 0333 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 6303928682 ద్వారా సంప్రదించాలని సూచించారు.

# డాక్టర్ ఆఫ్ కాన్వకేషన్ సర్టిఫికెట్ పొందిన బయ్యానేహాభవాని



**దేవరకొండ నవంబర్ 04. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన భయ్యా రమా వెంకట్ కుమార్తె నేహా భవానీ మహబూబ్ నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ , సరోజినీ రాములమ్మ ఫార్మసి కాలేజ్ నుండి (ఆరు సంవత్సరాలనుండి) 2019 నుండి 2025 వరకు డాక్టర్ ఆఫ్ ఫార్మసీ విద్యను అభ్యసించి ద్విగ్విజయంగా పూర్తిచేసి 4 -11-2025 నాడు 24 గ్రాడ్యుయేషన్ సెర్మని సందర్భంగా చీఫ్ గెస్టు జానకి ఐపిఎస్, గెస్ట్ అఫ్ ఆనర్ ఏ. వెంకటేశం సూపరిండెంట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ జైల్,మీ. శ్రీనివాలు ఐపీస్ (రిటైర్డ్),ఆధ్వర్యములో డాక్టర్ ఆఫ్ కాన్వకేషన్ సర్టిఫికెట్ పొందిన భయ్యా నేహా భవానీ ఈసందర్భంగా తల్లి దండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సమావేశం సరోజినీ రాములమ్మ ఫార్మసి కాలేజ్ సెమినార్ హాలులో డాక్టర్ పి బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ మంగిలాల్ కళాశాలఅధ్యాపకులు,అధ్యాపకురాలు,సహచర ఫార్మసీ విద్యార్థిని,విద్యార్థులు మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ నష్టంతో పత్తి పంట పరిశీలన

**రైతు వేదిక వద్ద దరఖాస్తు చేయండి -ఏవో సూచన**



**అమరాబాద్, నవంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల కురిసిన తుఫాన్ వర్షాలతో పత్తి పంట తీవ్రంగా నష్టపోయిన రైతులు తమ రైతు వేదిక వద్ద దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ రెడ్డి సూచించారు. శుక్రవారం అమరాబాద్ రైతులు రైతు వేదిక వద్ద దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ ఖాతా బుక్, పంట నష్టం జీపీఎస్ కలర్ ఫోటో జిరాక్స్ పత్రాలు సమర్పించాలని సూచించారు. నష్టపోయిన పత్తి పంటను సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఏవో మహేష్ రెడ్డి కొమరంపల్లి గ్రామంలో తుఫాన్ ప్రభావిత పంటలను పరిశీలించారు.

# సర్వే శాఖపై సమీక్ష, పత్తి కొనుగోలులో రైతులకు భరోసా

## పెండింగ్ అప్లికేషన్లకు డిసెంబర్ లోపు పరిష్కారం కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో సర్వే ల్యాండ్ శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పెండింగ్‌లో ఉన్న భూ భారతీ, ఎఫ్ లైన్, డి మార్కెటింగ్, ప్రజావాణి అప్లికేషన్లను డిసెంబర్ లోపు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఈ సమీక్ష నిర్వహించారు. సర్వే అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్న కలెక్టర్ టీజీఐఐసీకి సంబంధించిన అప్లికేషన్లను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని, మండల సర్వేయర్లు ప్రతి నెల తహసిల్దార్లకు టూర్ డైరీలు సమర్పించాలని సూచించారు. గత సర్వే రికార్డులను సేకరించి భద్రపరచాలని, కొత్తగా నియమితులైన లైసెన్స్ సర్వేయర్ల పనితీరుపై మండల



అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పత్తి కొనుగోలు కేంద్రాలపై సమీక్ష**
కలెక్టర్ శిబిర కార్యాలయంలో 2025-26 కాటన్ మార్కెట్ యంఎస్పీ క్రింద పత్తి సేకరణపై మిల్లర్లు, అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 22 జిన్నింగ్ మిల్లుల్లో 10 మిల్లుల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదని, రైతులు ఇబ్బందులు పడకుండా మిల్లర్లతో సమన్వయం చేస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు యాప్ ద్వారా మిల్లులను ఎంచుకునే వెసులుబాటు కల్పించామని, మిల్లుల సామర్థ్యం మించితే మరో మిల్లుకు తరలించే అవకాశం ఉందని వివరించారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని, పంటను ముందుగా ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సీసీఏ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఎం మార్కెటింగ్ నాగరాజు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# కులాంతర వివాహితుల జాతీయ సమ్మేళనం జయప్రదం చేయండి

**కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున**



**నల్లగొండ, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కులాంతర-మతాంతర వివాహితుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని, ఈ డిమాండ్ తో నవంబర్ 9న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న జాతీయ సమ్మేళనంను జయప్రదం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులాంతర, మతాంతర వివాహితులపై దాడులు, బెదిరింపులు, హత్యలు పెరుగుతున్నాయన్నారు. కులం పేరా, మతం పేరా, సనాతన ధర్మం పేరా ప్రేమజంటలను లక్ష్యంగా చేసుకుని అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇలాంటి పరిస్థితుల్లో కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరం అత్యవసరం," అని ఆయన స్పష్టం చేశారు. మూడు సంవత్సరాల క్రితమే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, భద్రత, నివాస సౌకర్యాలు, ఉపాధి హామీలు ఇంకా అమలు కాలేదని మండిపడ్డారు. కులాంతర వివాహాలు భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులు. కానీ ఈ హక్కులను అణగదొక్కే శక్తులు ఇంకా సమాజంలో ఉన్నాయని వారిని ఎదుర్కోవాలంటే చట్టపరమైన రక్షణతో పాటు సామాజిక చైతన్యం అవసరం," అన్నారు. కులాంతర మతాంతర వివాహితుల భద్రత కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్, కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, వివాహితులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, గృహాలు, విద్య, ఉపాధి అవకాశాలు ప్రత్యేక కోటాలో ఇవ్వాలని ,కులవివక్ష, మత ద్వేషం ప్రేరేపించే సోషల్ మీడియా ప్రచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ,ప్రతి జిల్లాలో కులాంతర వివాహితుల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ జాతీయ సమ్మేళనానికి అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు, మానవ హక్కుల సంఘాలు, సామాజిక సంస్థలు, కులాంతర వివాహితులు హాజరవుతారని తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి బొల్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ఉపాధి

**- రైతులకు ధాన్యం కొనుగోలు**
**- భక్తులకు ఏర్పాట్లు**
**-మంచిర్యాల కలెక్టర్ దీపక్ సమీక్ష**



**మంచిర్యాల, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మత్స్యకారుల ఉపాధి కోసం జిల్లాలో 223.93 లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. లక్షెట్టిపేట మండలం గుల్లకోట వద్ద 24.42 లక్షల చేప పిల్లలను వదిలారు. ఫిబ్రవరి -మార్చి 2026 నాటికి చేపలు వృద్ధి చెంది 1,000 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గుల్లకోటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ జిల్లాలో 345 కేంద్రాలు ఏర్పాటు చేశామని, గ్రేడ్ A రకానికి 2,389, సాధారణ రకానికి 2,369 మద్దతు ధర, సన్నరకం వడ్లకు అదనంగా ?500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు, డ్రయ్యర్లు, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. దండేపల్లి మండలం గూడెం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు బందోబస్తు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని సూచించారు. ద్వారక గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో షెడ్యూల్డ్ తెగల వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు, నాణ్యమైన బోధన కల్పించాలని అధికారులకు సూచించారు.

# దళిత బంధు లబ్ధిదారుల నిధులు వెంటనే విడుదల చేయాలి




**నల్లగొండ నవంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ నియోజకవర్గంలోని నిరుపేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ఇప్పటికే మంజూరైన దళిత బంధు నిధులను విడుదల చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈరోజు తిప్పర్తి మండల కేంద్రంలో జరిగిన దళిత బంధు లబ్ధిదారుల సమావేశంలో మనోహర్ అధ్యక్షతన మాట్లాడిన ఆయన మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలో 1243 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రొసీడింగ్స్ ఇచ్చి, వారి పేర్లకు మూడు లక్షల రూపాయల చొప్పున మొత్తం 33 కోట్ల రూపాయలు అకౌంట్లలో జమ చేశారని, కానీ ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల కాలేదని తెలిపారు.ప్రభుత్వం దళిత బంధు పథకం ద్వారా పేదలను ఆదుకోవడానికి నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ ఇచ్చి, లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లు తెరిపించి నిధులు మంజూరు చేసినప్పటికీ, అవి ఇప్పటి వరకు విడుదల కాకపోవడం అన్యాయమని అన్నారు. నవంబర్ 10 తర్వాత జిల్లా మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి క్యాంపు కార్యాలయం ముందు 1000 మంది దళితులతో బహిరంగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, అందరు లబ్ధిదారులు, ప్రజాసంఘాలు చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూరేపల్లి మనోహర్, ఏపూరి సైదులు, చెడిపల్లి ఏపూరి దాసు, ముసుగు వెంకన్న, మహంకాళి భాస్కర్, పందిరి రాజు, ఏపూరి ఇసాక్, ఏపూరి నాగయ్య, చెరుకుపల్లి సురేందర్, కిన్నెర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వర్గల్ లో మిల్లుల పరిశీలన

## హుస్నాబాద్ అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష



**సిద్దిపేట, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వర్గల్ మండలంలోని శ్రీ రామాంజనేయ ఆగ్రో ఇండస్ట్రీ మరియు మహాదేవి ఆగ్రో మిల్లులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి సందర్శించి, వడ్ల నుండి పారా బాయిల్డ్ రైస్ తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. అత్యాధునిక యంత్రాలతో అధిక పరిమాణంలో వరి ధాన్యాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగిన మిల్లులుగా వాటిని మిల్లర్ యజమానులు వివరించారు. మిషన్లలో రైస్ తయారీని పరిశీలించిన కలెక్టర్, జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి ధాన్యం తరలింపునకు బ్యాంక్ గారంటీ ఇవ్వాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ మార్గదర్శకాలను అనుసరించి, జిల్లా సివిల్ సప్లై అధికారుల సహకారంతో ప్రక్రియను పూర్తి చేయాలని మిల్లర్ యజమానులకు ఆదేశించారు. ఈ సందర్భనలో కలెక్టర్ వెంట డీఎంసీఎస్ ప్రవీణ్, డీసీఎస్ఓ తనూజ, తహసిల్దార్ రఘువీర్ తదితరులు ఉన్నారు. అంతకుముందు హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో రామ్మూర్తి, డిఆర్డిఒ జయదేవ్ ఆర్యలతో కలిసి ఈ సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కొత్త బట్టల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు వరసల రోడ్ నిర్మాణ పనుల్లో 90 శాతం చెట్ల తొలగింపు పూర్తయిందని, ఎలక్ట్రిక్ లైన్ తొలగింపునకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కోహెడ నుండి సముద్రాల వరకు బిటుమిన్ రోడ్ పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని, హుస్నాబాద్ రామవరం, అక్కన్నపేట–కొత్తకొండ రోడ్లతో పాటు ఇతర భవన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఎం.జి.నరేగా కింద నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు డిసెంబర్ చివరికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి కొరత ఉన్న గ్రామాల్లో పాత భవనాలకు ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించి, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అంగన్వాడి భవనాలు, కాంపౌండ్ వాల్‌లు జనవరి లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌డీఎఫ్ కింద చేపట్టిన పిహెచ్‌సీ, సబ్‌సెంటర్ భవన నిర్మాణాలు, మేజర్ మైనర్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో జంక్షన్ డెవలప్మెంట్, ఎల్లమ్మ చెరువు రోడ్ నిర్మాణం, సుందరీకరణ పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యుత్ ఉపకేంద్ర పనులు పురోగతిలో ఉన్నవాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కింద మండలాల్లో తాగునీటి సరఫరా పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరి కోతలు పూర్తవుతున్న నేపథ్యంలో ఆయిల్ ఫామ్ సాగుకు ఇది అనుకూల సమయమని పేర్కొంటూ, రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ, తోటల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# అందుగుల వాగుపై వంతెన నిర్మాణం అవసరం

## వర్షాల సమయంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు-నాయకుల విజ్ఞప్తి



**మాడుగుల, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మాడుగుల మండలంలోని అందుగుల గ్రామపంచాయతీ పరిధిలోని వాగు, సిరిసినగండ్ల గ్రామానికి వెళ్లే మార్గంలో ప్రధాన అడ్డంకిగా మారుతోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు ఉధృతంగా ప్రవహించడంతో అందుగుల, కుబ్యతండా, అంతంపేట గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్లలేక, ఆసుపత్రులకు చేరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చరకొండ, కల్వకుర్తి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాలు కూడా వాగు దాటలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కుబ్యతండా గ్రామపంచాయతీ యువ నాయకుడు నేనావత్ అనిల్ నాయక్ వాగుపై వంతెన నిర్మించాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిని కోరారు.వర్షాకాలంలో వాగు ఉధృతి పెరిగే ప్రతి సారి ప్రజలు బంధించబడుతున్నారని, శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మాణం అత్యవసరమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



**ఆమనగల్లు, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

: ఈ నెల 15న ఆమనగల్లు కోర్టులో జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప సూచించారు. శనివారం కోర్టు భవనంలో పోలీస్ అధికారులతో సమావేశమై, లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "వాది, ప్రతివాదులు, కక్షిదారులు పరస్పర రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవచ్చు. ఇది న్యాయ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. అందరూ ముందుకొచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆమనగల్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జానకిరామ్, కడ్తాల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, ఆమనగల్లు ఎస్సై వెంకటేష్, తలకొండపల్లి ఎస్సై ఏ. శ్రీకాంత్, మాడుగుల ఎస్సై రాఘవేందర్, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై అధికారుల స్పందన అభినందనీయం: దొంత కర్ణకర్




### వర్షాలతో ప్రమాదకర స్థితికి రోడ్డు

**చిగురుమామిడి -కరీంనగర్ మార్గంలో గుంతలతో ప్రయాణదారులకు ఇబ్బందులు**

**హుస్నాబాద్, నవంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

చిగురుమామిడి మండలంలో భారీ వర్షాల కారణంగా చిగురుమామిడి నుండి కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కకు కయ్య కొట్టడంతో గుంతలు ఏర్పడి, రాత్రివేళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు ప్రమాదాలు జరగకపోయినా, భవిష్యత్తులో ప్రమాదాలకు అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి, గుంతలను మట్టి పోసి కూర్చి వేయాలని బీజేపీ నేత దొంత కర్ణాకర్ డిమాండ్ చేశారు.

**హుస్నాబాద్, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తుఫాన్ కారణంగా రోడ్డు పక్కన ఏర్పడిన కయ్యలు ప్రజలకు ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో, ఈ విషయాన్ని భారతీయ జనతా పార్టీ తరఫున సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి, తక్షణమే కయ్యలను పూడ్చిన అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బీజేపీ బూత్ అధ్యక్షుడు దొంత కర్ణకర్ తెలిపారు.ప్రజల సమస్యలపై ఇటువంటి చురుకైన స్పందన ఎప్పటికీ అభినందనీయం అని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ ఇదే విధంగా ప్రజల సంక్షేమం కోసం అధికారులు ముందుండాలని ఆకాంక్షించారు.

# 'వికసిత్ భారత్ రోజగార్ యోజన

**-ఉద్యోగులు, యాజమాన్యాలకు**
**-లాభదాయకం" : పీఎఫ్ కమిషనర్ మధుసూదనాచారి**




**వనపర్తి, నవంబర్ 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజగార్ యోజన పథకంపై అవగాహన కల్పించేందుకు ప్రాంతీయ భవినిధి కార్యాలయం, రంగారెడ్డి–హైదరాబాద్ ఆధ్వర్యంలో వనపర్తి మునిసిపల్ కార్యాలయంలో సెమినార్ నిర్వహించారు. ఇందులో ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాలకు పథకం ప్రయోజనాలు, రిజిస్ట్రేషన్ విధానం, కొత్త చలాన్ జెనరేషన్ ప్రక్రియ, ఎంప్లాయిమెంట్ ఎన్రోల్మెంట్ కాంపెయిన్ వివరించారు. కార్యక్రమంలో రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 బి.మధుసూదనాచారి, అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ కేవీన్ రామకృష్ణ, ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్లు ప్రసాద్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉద్యోగులు, యాజమాన్యాలు రెండింటికీ ఈ పథకాలు లాభదాయకమని, ఉద్యోగుల కుటుంబాలకు కూడా సౌకర్యవంతంగా ఉంటాయని మధుసూదనాచారి తెలిపారు.

# రైతుల నష్టాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

## బీజేపీ మండల అధ్యక్షుడు కురుమిద్దె యాదగిరి



**వెల్దండ, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కురుమిద్దె యాదగిరి డిమాండ్ చేశారు. వెల్దండ మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్తిక్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రంగు మారిన గింజలు, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన కోరారు. వర్షాల కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు 30,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జర్నల్ సెక్రటరీ రవి విష్ణు గౌడ్, సింగర్ విండో మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు జూలూరు బాలస్వామి, చక్రవర్తి గౌడ్, శ్రీశైలం, వెంకటేష్, కొండల్, పరమేష్, పెద్దయ్య, శ్రీకాంత్, జైన్నయ్య, కృష్ణయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సంరక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**వర్ధన్నపేట, నవంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ కార్యదర్శి రామారావు ప్రారంభించారు. ఉదయం 10గంటలకు నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 80 మందికి బీపీ, షుగర్,ఈసీజీ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంరక్ష హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామారావు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికగా పోటీలు

## జిల్లా స్థాయికి అర్హత సాధించిన విజేతలు



గెలుపొందిన విద్యార్థులు



**ఎలిగేడు, నవంబర్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

సాట్ మరియు తెలంగాణ రాష్ట్ర హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో మండలంలోని ఎలిగేడు, సుల్తాన్పూర్, ధూళికట్ట పాఠశాలల 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈఓ నరేంద్ర చారి అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో ఎలిగేడు 8వ తరగతి విద్యార్థిని ఎన్ విజ్ఞత ఉపన్యాసంలో, సుల్తాన్పూర్ 10వ తరగతి విద్యార్థిని ఎం అక్షయ వ్యాసరచనలో, ఎలిగేడు 10వ తరగతి విద్యార్థి బి వెంకట తేజ క్విజ్‌లో ప్రథమ స్థానాలు సాధించారు. విజేతలు జిల్లా స్థాయి పోటీలకు అర్హత పొందగా, పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఓటమిని అంగీకరిస్తూ విజయం కోసం తపనతో ముందుకు సాగాలని ఎంఈఓ నరేంద్ర చారి సూచించారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ గంద్ర దేవేందర్ రావు విజేతలను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో గెలుపొందేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సదయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి, ఎల్. శ్రీనివాస్, ఓం ప్రకాష్, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.